నేటి దినపత్రిక
# సూర్య
శనివారం
30 డిసెంబరు
2023
పేజీలు 8
## అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్






# అర్హులందరికీ కేంద్ర పథకాలు

- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్ సుక్ మాండవియా వెల్లడి
- మామిళ్లపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, 104 మొబైల్ మెడికల్ క్లినిక్‌ల పరిశీలన
- పాల్గొన్న వైద్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ఉన్నతాధికారులు



నేటి దినపత్రిక సూర్య, గుంటూరు బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలందరికీ అందించటమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యం అని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవియా పేర్కొన్నారు. శుక్రవారం పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను, 104 మొబైల్ మెడికల్ క్లినిక్‌ను  కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్ సుఖ్ మాండవియా, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర ప్రబరి అధికారి కేంద్ర ప్రభుత్వం తరపున సాల్మన్ ఆరోఖ్య రాజ్ , రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు , రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె.నివాస్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారిలతో కలసి సందర్శించారు. పంట పొలంలో రసాయనాలు



వెదజల్లెందుకు ఉపయోగించే అత్యాధునిక డ్రోన్ ప్రదర్శనను, పౌర సరఫరాల శాఖ ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ భారత్, టీబీ స్క్రీనింగ్, ఎలిమినేషన్, నెహ్రూ యువకేంద్రం, గ్రామ వార్డు సచివాలయ శాఖ మై భారత్ వాలంటీర్ ఎన్రోల్మెంట్ మరియు ఆధార్ క్యాంప్, వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. సభలో తొలుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం వీడియోను, ప్రభుత్వ

2లో...

## నాటక రంగ మహర్దశకు
# ప్రభుత్వం కృషి

- ఘనంగా 22వ నంది నాటక బహుమతులు ప్రధానం
- నాటక రంగంలో ఎంతోమంది డబ్బు కోల్పోయారు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



నేటి దినపత్రిక సూర్య, గుంటూరు బ్యూరో

సమాజానికి ప్రాణప్రధానమైన నాటక రంగాన్ని, నాటకరంగ కళాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నంది నాటకోత్సవాలను ఘనంగా నిర్వహించి అధ్బుతమైన అవార్డులు అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. శుక్రవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన  22వ నంది నాటక బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టివి, నాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డితో కలసి పాల్గొన్నారు. ఎన్టీ ఆర్ రంగస్థల అవార్డు 2022 విశాఖపట్నంకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డా. మీగడ రామలింగ స్వామికి గజమాలతో సన్మానించి జ్ఞాపిక, రూ.1,50,000 చెక్కు అందించారు. వైఎస్ఆర్ అవార్డు 2023 కాకినాడకు చెందిన యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ప్రతినిధులను గజమాలతో

2లో...



# జర్నలిజం పవిత్రమైన వృత్తి

## సిఆర్ మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు వెల్లడి
## జర్నలిజం డిప్లొమా హోల్డర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

నేటి దినపత్రిక సూర్య, గుంటూరు బ్యూరో

జర్నలిజం పవిత్ర వృత్తి అని, ఇందులో రాణించాలంటే విషయ పరిజ్ఞానం అవసరమని సి.ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు లోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రొ. బాలమోహనదాస్ సెమినార్ హాల్‌లో శుక్రవారం జరిగిన జర్నలిజం డిప్లమొ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. జర్నలిస్టులుగా రాణించా లనుకునే వారు రాష్ట్రం ఏర్పాటైన 1953 నుంచి జరిగిన పరిణామాలపై సమగ్ర అవగాహన కలిగి వుండాలని ఆయన అన్నారు. వార్త రాసేటపుడు పాటించాల్సిన కనీస నియమాలను తెలుసుకుని వాటిని పాటించడం ద్వారా విలువలతో కూడిన జర్నలిజంను ఆచరించి చూపాలని ఆయన ఉద్భోధించారు. వార్తను వార్తగా రాయడం, రెండో పక్షం అభిప్రాయాన్ని జోడించి రాయడం, నిజాన్ని నిర్ధారించుకునే ప్రయత్నం చేయడం జర్నలిజం మౌలిక సూత్రాలని ఆయన తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ తో కలిసి సి.ఆర్. మీడియా అకాడమీ నిర్వహించిన డిప్లమో ను సద్వినియోగం చేసుకుని జర్నలిజం రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కోర్సు నిర్వహణ లో

2లో...



- మీ ఇంటిబిడ్డగా నన్ను ఆశీర్వదించండి
- వరుసగా మూడో రోజు తటస్థ ప్రముఖులతో లోకేష్ భేటీ

# మంగళగిరిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

# దోచుకో పంచుకో దాచుకో వైకాపా నైజం



పెదకాకాని మేజర్ న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ప్రజలకు చేసింది ఏమీ లేదని సహజ వనరులను కొల్లగొట్టి దోచుకో పంచుకో దాచుకో అనే నినాదంతో వైకాపా ఎమ్మెల్యేలు మంత్రులు సైతం రాష్ట్రాన్ని కొల్లగొడుతున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెదకాకాని శివాలయం మాజీ చైర్మన్ ఆలపాటి సత్యనారాయణ పేర్కొన్నారు చేబ్రోలు మండలంలోని గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తే వైకాపా నాయకులు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడుతున్నారు అర్థమవుతుందని ఆయన అన్నారు గ్రావెల్ తవ్వకాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న తవ్వకాలను సాక్షాత్తు జిల్లా కలెక్టర్ పరిశీలించి కూడా పట్టించుకోకపోవడం న్యాయస్థానాల ఆదేశాలను సైతం అధికారులు విస్మరించడం వైకాపా పాలనలో జరుగుతున్న విధ్వంసకర పరిస్థితులకు నిదర్శనం అన్నారు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తానని వాగ్దానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జరుగుతున్న సహజ వనరుల దోపిడిని ప్రోత్సహించడం ఎంత వరకు సబబు అని ఆయన అన్నారు దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని అక్రమంగా లాక్కొని దౌర్జన్యంగా మైనింగ్ పాల్పడుతున్న నాయకులను సంబంధిత శాఖ అధికారులు సైతం తవ్వకాలను ఆపకపోవడం ఈ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనం అన్నారు వైకాపా నాయకుల అక్రమాలపై గళమెత్తిన తెలుగుదేశం పార్టీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి వారి నోళ్లను మూయించటానికి ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ఎంతో కాలం కొనసాగవని అన్నారు మూడు నెలల్లో జగన్ ప్రభుత్వం అడ్రస్ లేకుండా పోతుందని వైకాపా ప్రభుత్వ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు ప్రజా అభిమానంతో తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుండి వైకాపా నాయకులు దోచుకున్న ప్రతి పైసా వెనక్కి తీసుకువచ్చి ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చేస్తున్న అక్రమ మైనింగ్ ను అడ్డుకోవడానికి సహజ వనరులను కాపాడటానికి పొన్నూరు మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చేపట్టిన రెండు రోజుల పాదయాత్ర లో అక్రమ మైనింగ్ పై ప్రజలకు సాక్ష్యాలతో సహా చూపించారు అన్నారు గ్రావెలను కొల్లగొట్టిన స్థానిక శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య . సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయేసరికి ఏం మాట్లాడాలో తెలియక ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలి అన్నారు

# అంగన్వాడీలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



పెదకాకాని మేజర్ న్యూస్ : అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమ్మె శిబిరం 18వ రోజు అంగన్వాడీలులకి ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సురేష్ మద్దతు తెలిపారు ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తాం అని చెప్పి అధికారం లోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు పరిష్కారం చేయకుండా అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టటం సరైనది కాదని అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని గ్రాట్యుటీ అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్చాలని వర్కర్లతో సమానంగా వేతనాలు ప్రమోషన్లు ఇవ్వాలని హెల్పర్ల ప్రమోషన్ నులకు వైయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి అని రాజకీయ జోక్యం నివారించాలని ఎఫ్. ఆర్ . ఎస్ రద్దు చేయాలని అన్ని యాప్లను కలిపి ఒకే యాప్ గా మార్చాలని సర్వీసులో ఉండి చనిపోయిన అంగ న్వాడి ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీమా అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న సెంటర్ అద్దెలు 2017 నుండి ఇవ్వవలసిన టి ఏ బిల్లులుఇతర పెండింగ్ బకాయిలు చెల్లించాలని వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వారి పోరాటానికి పంచాయతీ వర్కర్స్ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజా రమేష్ కే సత్యనారాయణ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి దీవి నరసింహారావు సుబ్బారావు సాంబయ్య పిల్లి దానియేలు అమృతరావ్ తదితరులు పాల్గొన్నారు.

# "జర్నలిజం-జర్నలిస్టులు" పుస్తకం జర్నలిస్టులకు ఆదర్శం..కొమ్మినేని శ్రీనివాసరావు



మంగళగిరిటౌన్, మేజర్ న్యూస్: "జర్నలిజం-జర్నలిస్టులు" పుస్తకం జర్నలిస్టులకు ఆదర్శం అని ఏపీ.సి.ఆర్ మీడియా చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిప్లమో ఇన్ జర్నలిజం ఉత్తీర్ణులకు శుక్రవారం ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ ప్రధానం కార్యక్రమానికి కొమ్మినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భం గా మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఏపీ.సి.ఆర్ మీడియా చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుని కలిశారు.గతనెల 16న జాతీయ పత్రికా దినోత్సవం రోజున ఈ జర్నలిజం- జర్నలిస్టులు(పరిశోధనాత్మక కథనాలు) పుస్తకం ఆవిష్కరించబడింది అని, జర్నలిజం-జర్నలిస్టులు పుస్తకంలో రాసిన విషయాలను తమరి దృష్టికి కూడా తీసుకు రావాలని ఈ ప్రత్యేక పుస్తకం మీకు అందిచడం జరుగుతుందని రచయిత, జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం కొమ్మినేనితో అన్నారు. అనంతరం కొమ్మినేని మాట్లాడుతూ డిప్లమో ఇన్ జర్నలిజంలో ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ పొందిన వారు కూడా ఇలా జర్నలిజంపై పట్టు సాధించి ఇలాంటి రచనలు చేయాలని కోరారు.అలాగే ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయ్ బాబుకి కూడా ఒక పుస్తకం అందించారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ సభ్యులలో డిప్లమో ఇన్ జర్నలిజం ప్రొవిజినల్ సర్టిఫికేట్స్ అందుకున్న సీనియర్ జర్నలిస్టులు బత్తుల సాంబశివరావు,వాసు విడేలా మరియు చక్కా కళ్యాణ్ పాల్గొన్నారు.

# డాక్టర్ కార్తీక్ కు హియోషి యంగ్ లీఫ్ అవార్డు



మంగళగిరి, మేజర్ న్యూస్: మంగళగిరి మండలం నీరుకొండ ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎన్విరాన్మెంట్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ కు హియోషి గ్రూప్ ఏటా శాస్త్రవేత్తలకు అందించే ప్రతిష్టాత్మక యంగ్ లీఫ్ అవార్డు లభించింది. పర్యావరణ సంబంధ పరిశోధనల్లో విశేషమైన సేవలు అందిస్తున్నందుకు గాను 2023 సంవత్సరానికి డాక్టర్ కార్తీకన్ ను ఎంపిక చేసి హియోషి కంపెనీ అవార్డును ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం డాక్టర్ కార్తీక్ అవార్డును అందుకున్నారు. డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ గడచిన నాలుగేళ్లుగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యావరణ శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెస ర్ గా పని చేస్తున్నారు. బోధన, రీసెర్చ్ రంగాల్లో డాక్టర్ కార్తీక్ ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. ఇటీవలనే ఆయనకు యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా లభించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ అరోరా శుక్రవారం డాక్టర్ కార్తీక్ ను అభినందించారు.

# చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి



తెనాలిరూరల్, మేజర్ న్యూస్ : రాష్ట్రం అభివృద్ధి పథంలోకి వెళ్లాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని తెదేపా, జనసేన నాయకులు పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో తెదేపా, జనసేన కలసి బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లిబోయిన నాగేశ్వరరావు, జనసేన నాయకులు గుంటూరు కృష్ణ మోహన్ మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.రాష్ట్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో షేక్ జిలాని, తెదేపా, జనసేన కార్యకర్తలు ఉన్నారు.

# రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి



పెదకాకాని మేజర్ న్యూస్ : భగవంతుని కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే సంగం డైరీ చైర్మన్ ధూళిపాల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు శుక్రవారం పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో వేంచేసియున్నా శ్రీ గంగా భ్రమరాంబాసమేత శ్రీ చంద్రశేఖర స్వామి వారి 81వ వార్షిక ఆర్థ్రామహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నరేంద్ర కుమార్ స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు ఆలయానికి విచ్చేసిన నరేంద్ర కుమార్ కు మహోత్సవ నిర్వాహ కమిటీ సభ్యులు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు నరేంద్ర కుమార్ కు వేద ఆశీర్వాదం అందజేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాచవరం మల్లికార్జునరావు సంజీవ్ లక్ష్మణ్ నాగేశ్వరరావు సంపత్ ధర్మేంద్ర గ్రామ ఉపసర్పంచ్ వేణు కుమార్ నందిపాటి ప్రసాద్ కూచిపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత



తెనాలి,మేజర్ న్యూస్: జిల్లా క్షయ నివారణ అధికారుల సూచనలతో తెనాలి జిల్లా వైద్యశాల టీబీ యూనిట్ నందు 27 మంది క్షయ రోగులకు శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు.ఈ సందర్భంగా టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ రోగులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వలన క్షయ వ్యాధి ఒకరి నుండి మరోకరికి వ్యాప్తి చెందదన్నారు.గుంటూరుకు చెందిన ఐటిసి కంపెనీ,నాట్కో సంస్థ గతంలో కలెక్టర్ కి అందించిన ఆర్థికసాయంతో గోధుమ పిండి,రాగిపిండి,ఆయిల్ ప్యాకెట్,కందిపప్పు, శనగలు అందజేశామని,త్వరలో పెద్దలకు బిసిజి వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, భార్గవి, లక్ష్మీ,దిలీప్, పావని, వనజ, సంధ్యారాణి పాల్గొన్నారు.

# జర్నలిజం పవిత్రమైన వృత్తి

**మొదటి పేజీ తరువాయి** సహకరించిన వైస్ ఛాన్సలర్ రాజశేఖర్, జర్నలిజం విభాగపు అధిపతి డా. అనిత, కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన బి.ఆర్.అంబెడ్కర్ యూనివర్సిటీ స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఎల్.వి.కె.రెడ్డిలకు చైర్మన్ కృజ్ఞతలు తెలిపారు.

మాటను మించిన ఆభరణం లేదనేది ఆర్యోక్తి అని, పత్రికల్లో రాసేటప్పుడు గాని, ప్రసార మాధ్యమాల్లో పలికే టపుడుగాని, సందర్భోచితంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని అధికార భాషా సంఘం చైర్మన్ పి. విజయబాబు అన్నారు. సుదీర్ఘ కాలం జర్నలిజం రంగంలో నునిశితత్వం, సున్నితత్వం తో రాణిస్తోన్న మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావును, సాధారణ జర్నలిస్టుగా ప్రారంభించి, జాతీయ పత్రిక అయిన హిందూ దిన పత్రిక కు రెసిడెంట్ ఎడిటర్ గా ఎదిగిన రెడ్డం అప్పాజీ ను పాత్రికేయులు రోల్ మోడల్ గా భావించాలని ఆయన కోరారు. నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. పి.రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిజం డిపార్టుమెంటులో ప్రవేశాలు తగ్గ ముఖం పడుతున్న సంగతిని ప్రస్తావించారు. అయితే, జర్నలిజం చాలా సాహసోపేతమైన వృత్తి అని పేర్కొన్నారు. సమాజం మార్పులను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తెస్తూ, సమాజ మూల్యాంకనంలో జర్నలిస్టులు భాగస్వాములవుతారని ఆయన అన్నారు.

హిందూ దినపత్రిక ఆంధ్రప్రదేశ్ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డమ్ అప్పాజీ మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా పోటీ పెరిగినప్పుడు అవకాశాలు కూడా పెరుగుతాయని, జర్నలిజం వృత్తి కూడా ఇందుకు మినహాయింపు కాదని అన్నారు. అయితే, క్రమశిక్షణ, నిరంతర కృషి మాత్రమే మనకు మంచి భవిష్యత్తును అందించగలవని ఆయన అన్నారు. వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటి కప్పుడు పెంచుకుంటూ నిత్యం నేర్చుకుంటూ వుండే తత్వాన్ని అలవరచుకోవాలని ఆయన సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు నేర్చుకోకుండా, ప్రస్తుత పోటీ ప్రపంచం లో మనుగడ సాగించలేమని ఆయన పేర్కొన్నారు. "ఛాట్ జిపిటి" వంటి సాఫ్ట్‌వేర్‌లు ఎన్ని వచ్చినా వాటిని పత్రికకు అన్వయించ గలిగేది జర్నలిస్టు మాత్రమేనని, ఇందుకు భాష పై పట్టు సాధించడం ముఖ్యమని అన్నారు.

కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించిన డా. ఎల్.వి.కె రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం డిప్లొమో కోర్సును నిబద్ధతతో అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేలా తీర్చి దిద్ది నిర్వహిచడంలో సహకరించిన సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు, నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కోర్సు లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు జర్నలిజం రంగంలో రాణించాలని ఆయన కోరారు.

నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ కోర్సులోని అంశాలతో పాటు, ప్రతి శనివారం ప్రముఖుల ద్వారా అందించే సామాజిక, సాంస్కృతిక, చారిత్రాత్మక, అంశాల ద్వారా అభ్యర్థులు మరిన్ని అంశాలను లోతుగా అధ్యయనం చేసేలా ఆన్ లైన్ క్లాసులు ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం చైర్మన్ పి.విజయబాబు సతీమణి శారద మాట్లాడుతూ నిత్య విద్యార్థిగా జర్నలిస్టులు కొనసాగాలని అన్నారు. సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ మాట్లాడుతూ జర్నలిజంలో డిప్లమా కోర్సు ను ఆరు నెలల పాటు నిర్వహించి, అక్టోబర్ లో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డిప్లమో ఇన్ జర్నలిజం లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్ లు, మార్కుల మెమోలు వైస్ ఛాన్సలర్ ప్రొ. రాజశేఖర్, మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, అధికార భాష సంఘం చైర్మన్ పి. విజయబాబు, హిందూ దినపత్రిక ఆంధ్ర ప్రదేశ్ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డమ్ అప్పాజీ లు అందచేశారు. అనంతరం డిప్లమో ఇన్ జర్నలిజం లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు, వర్కింగ్ జర్నలిస్టులకు అడ్వాన్సుడు సాఫ్ట్ వేర్ టూల్స్ ఫర్ ఈ- పబ్లిషింగ్ పై నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన ఈ. శ్రీనివాస రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ బి. నరసా రెడ్డి, అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ రెడ్డి ప్రకాశరావు, ,మీడియా అకాడమీ చైర్మన్ ఓ.ఎస్.డి. ఎస్. శ్రీనివాస జీవన్, ఏ.ఓ. ఎం.ఎస్. ఎన్ మూర్తి, డి.పి.ఓ ఎం. లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# నాటక రంగ మహర్దశకు ప్రభుత్వం కృషి

**మొదటి పేజీ తరువాయి** సన్మానించి జ్ఞాపిక, రూ.5,00,000 చెక్కు అందించారు. సినీయర్ నాటక కళాకారులు కెఎస్‌కె సాయిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గుంటూరులో ప్రముఖ కళాకారుడు, హరిశ్చంద్ర నాటక రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం కళా ప్రాంగణంలో నంది నాటకోత్సవాల తుది పోటీలకు సంబంధించి 38 ప్రదర్శనల కార్యక్రమం వైభవంగా నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. నాటక రంగం మొదటిదని, నాటకరంగంలో విజయవంతమైన వారు సినిమాల్లోను విజయాలు సాధిస్తారన్నారు. నాటకాల ప్రదర్శన చాల కష్టతరమైనదని, మంచి సందేశాన్ని అందించే నాటకాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సంక్షిప్త రూపంలో ప్రదర్శిస్తున్నారన్నారు. సినిమాల్లో, టీవీలో నటించేవారు డబ్బు సంపాదిస్తారని, నాటకం రంగంలో డబ్బులు పోగొట్టుకున్న నటీ, నటీనటులే ఎక్కువ మంది ఉన్నారన్నారు. నాటక కళాకారులకు డబ్బు కంటే ప్రేక్షకులు కొట్టే చప్పట్లే గౌరవాన్ని ఇస్తాయన్నారు. ప్రజలను ఆకట్టుకునేలా రాజకీయ నాయకులు ప్రసంగాలు చేయాలన్నా మాడ్యులేషన్ తో మాట్లాడే నాటకరంగంలో అనుభవం తప్పనిసరి అన్నారు. నాటక కళాకారులుగా పేద, మధ్యతరగతికి చెందిన వారు ఉంటారని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాటకరంగాన్ని ప్రోత్సహించాటానికి ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటున్నారన్నారు. నాటక, టీవీ, చలన చిత్ర రంగంలో విశేష అనుభవం ఉన్న పోసాని కృష్ణమురళిని నాటక, టీవీ, చలన చిత్ర అభివృద్ధి సంస్థకు నిదర్శనంగా నియమించటమే అందుకు నిదర్శనం అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టివి, నాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కల్గిన కళాకారులకే అవార్డులు అందిచాలని, కళారంగాన్ని, కళాకారులను ప్రోత్సహిస్తాననే నమ్మకంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. కరోనా కారణంగా రెండున్నర సంవత్సరాలు ఇబ్బంది ఉండటంతో తొలుత నాటక రంగానికి సంబంధించి నంది నాటకోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించటం జరుగుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాటకరంగాన్ని ప్రోత్సహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో 22వ నంది నాటకోత్సవాలను మహ యజ్ఞంలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం జరిగిందన్నారు. వారం రోజులపాటు జరిగిన ప్రదర్శనలలో కళాభిమానులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తిలకించారన్నారు. నాటక ప్రదర్శనలను ఘనంగా నిర్వహించటానికి సహకారం అందించిన జిల్లా యంత్రాగానికి, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

నంది నాటకోత్సవాలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వారికి, వివిధ కమిటీల బాధ్యతలు నిర్వహించిన అధికారులను , ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. 22వ నంది ఉత్తమ నాటక అవార్డులు విజేతలకు స్వర్ణ, రజిత, కాంస్య నందులను , వ్యక్తిగత విభాగాల్లోనూ నందులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టివి మరియు నాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ మరియు నాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి అందించారు.

**22వ నంది ఉత్తమ నాటక అవార్డులు విజేతలు**

**<u>పద్య నాటకాలు</u>**

స్వర్ణ, రజిత, కాంస్య నందులు వరుసుగా 1.మాధవ వర్మ , 2. శ్రీకాంత కృష్ణమాచార్య , 3. వసంత రాజీయం

**<u>సాంఘిక నాటకం</u>**

స్వర్ణ, రజిత, కాంస్య నందులు వరుసుగా 1. ఇంద్రప్రస్థం, 2. ద ఇంపోస్టర్స్ 3. కలనేత

**<u>సాంఘిక నాటిక</u>**

స్వర్ణ, రజిత, కాంస్య నందులు వరుసుగా 1. ఆస్థికలు, 2. కమనీయం,3. చీకటి పువ్వు

**<u>బాలల నాటికలు</u>**

స్వర్ణ, రజిత, కాంస్య నందులు వరుసుగా 1. ప్రపంచ తంత్రం ,2. బాధ్యత ,3. మూడు ప్రశ్నలు

**<u>యూనివర్సిటీ/కాలేజి నాటికలు</u>**

స్వర్ణ, రజిత, కాంస్య నందులు వరుసుగా 1. ఇంకానా , 2. కపిరాజు, 3. ఉద్దం సింగ్

కార్యక్రమంలో రాష్ట్ర చలన చిత్ర , టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ శేష సాయి , రాష్ట్ర కుమ్మరి , శాలివాహన కార్పొరేషన్ చైర్మెన్ మండేపూడి పురుషోత్తం , జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రభాకర రెడ్డి , ఎఫ్ డీసీ అధికారులు , కళాకారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

**మొదటి పేజీ తరువాయి** పథకాలపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్ సుఖ్ మాండవియా మాట్లాడుతూ మామిళ్లపల్లిలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం సంతోషకరం అన్నారు. సమాజాభివృద్ధి కొరకు మరియు పేదల అభివృద్ధి కొరకు భారత ప్రభుత్వము గౌరవనీయ ప్రధానమంత్రి గారు నిర్దేశించిన విధముగా 17 పథకముల అమలు , దాని వలన జరిగిన, జరుగుచున్న అభివృద్ధిని ప్రజలకు తెలియపరుచుటకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించటం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీయంజేవై కార్డు ద్వారా గాని , రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు ద్వారానైనా గాని వైద్య చికిత్సలు ఉచితంగా అందుతాయని , పియంజేవై కార్డు పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోగులు కలసి వుంటాయన్నారు. యువతి యువకులు వ్యాపార అవసరాల కోసం బ్యాంక్ లోన్ కోసం ముద్ర లోన్స్ తీసుకోవచ్చన్నారు. గ్యాస్ కనెక్షన్ లేనివారు అప్లై చేసుకుంటే వెంటనే అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు బాగుందని , వైద్య రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతి వర్గానికి అన్ని రకాల సంక్షేమ ఫలాలను అందిస్తున్నారాని , అర్హత వుండి ఎవరికైనా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరని వారికి వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమం ద్వారా లబ్ది చేకూర్చడం





జరుగుతుందన్నారు. రైతులకు నానో ఫర్టీలైజర్ ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన పంటలను పండించవచ్చన్నారు. పంట పొలంలో రసాయనాలు వెదజల్లెందుకు అత్యాధునిక డ్రోన్ నానో ఫర్టీలైజర్ ఎరువులు, డిఏపి కలిపి ఉపయోగిస్తే మొక్కలకు చక్కగా అందుతుందని , తద్వారా పంట దిగుబడి బాగుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులు ఉపయోగించుకొని లబ్ది పొందాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నానన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య, విద్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు తీరును రాష్ట్రాలలో ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకోవడానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా. మన్‌సుఖ్ మాండవియా రావడం చాలా సంతోషకరమన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న కేంద్ర పథకాలను డా.మన్‌సుఖ్ మాండవియా కు వివరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పుల గురించి తెలియజేడం జరిగిందన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా 17 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి ఆసుపత్రులను అభివృద్ధి చేయడం జరిగిందని, రాష్ట్రంలో 8,500 కోట్ల రూపాయలతో 11 మెడికల్ కళాశాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతున్నదని, వీటిలో ఐదు కళాశాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా 90 శాతం పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా వుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య చికిత్సల పరిమితిని ఐదు లక్షల రూపాయల నుండి 25 లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు గ్రామాల్లో అందజేసేటట్లు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందజేస్తుందని తెలియజేశారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ భారత దేశం అభివృద్ధిలో 2047 నాటికి అగ్ర దేశాల సరసన చేరాలన్నది వికసిత భారత సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పియంజేవై , వైయస్సార్ ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా గాని ఉచితంగా వైద్య సేవలు అందుతాయన్నారు. పియంజేవై కార్డుపై రూ. 5 లక్షల పరిమితి వుందని , వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుపై రూ.25 లక్షల పరిమితి వుందన్నారు. అదే క్యాన్సర్ లాంటి వ్యాధులకు పరిమితి లేదని తెలియజేశారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు లు ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలలో రిఫరల్ ఆశు పాత్రులలో పని చేస్తుందని , పియంజేవై కార్డు దేశం మొత్తం మీద ఉపయోగించుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లేటప్పుడు పియంజేవై కార్డును అందుబాటులో వుంచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్‌రావు, డియం అండ్ హెచ్ఓ డా. శ్రావణబాబు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు , పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ , జాతీయ లేబర్ బోర్డు చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ , బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర , జిల్లా ప్రధాన కార్యదర్శి వైవి. సుబ్బారావు , పొన్నూరు అసెంబ్లీ కన్వీనర్ సుధాకర్ , పొన్నూరు మండల తహశీల్దార్ శ్రీకాంత్ కేధార్ నాథ్ , యంపిడీఓ శ్రీనివాస్ , మామిళ్లపల్లి గ్రామ సర్పంచ్ జాలాది యానాది రావు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు , సిబ్బంది , ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు , ప్రజలు పాల్గొన్నారు.



## అయిదవ రోజుకు చేరుకున్న శ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు



పెడన, మేజర్ న్యూస్ : గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నేటికీ నాలుగవ రోజు కొనసాగుతున్నాయని అమ్మవారి జాతర మహోత్సవాలలో మొక్కుబడులు తీర్చుకునే భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించాలని ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ జాతర మహోత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు పెడన మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతోనూ ఆలయ పాలకమండలి, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ జాతర మహోత్సవాలలో ది 4-01-24 న అనగా గురువారం రాత్రి 7 గంటలకు అమ్మవారికి తెప్పోత్సవ కార్యక్రమం జరుగునని తెలిపారు.

## క్రమబద్ధీకరించని ఉత్పత్తుల్లో పెట్టుబడులు వద్దు

విజయవాడ మేజర్ న్యూస్ : కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తుందని ఎన్ఎస్ఈ ఎండి, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ అన్నారు. 'వివేకం, శ్రద్ధతో ఆర్థిక వృద్ధికి సంబంధించిన ప్రయాణాన్ని ప్రారంభించమని ఎన్ఎస్ఈ మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. నమోదిత మధ్యవర్తులతో మాత్రమే లావాదేవీలు నిర్వహించండి. క్రమబద్ధీకరించని ఉత్పత్తుల్లో ఎప్పుడూ పెట్టుబడి పెట్టకండి. స్టాక్ మార్కెట్ ద్వారా చేసే పెట్టుబడి దీర్ఘకాల సంపద సృష్టి కోసం ఉద్దేశించబడింది. ఒక ఇబ్బందికరమైన అనుభవం అత్యంత స్థిరంగా ఉన్న పెట్టుబడిదారులను కూడా నిరుత్సాహపరుస్తుంది. మీరు స్టాక్ మార్కెట్‌కు కొత్తవారైనా లేదా నిపుణుడు కాకపోయినా జాగ్రత్తగా నడవడం చాలా కీలకం. అధిక రిస్క్ డెరివేటివ్స్ లేదా స్టాక్ మార్కెట్‌లో తరచుగా వర్తకం చేయడం వల్ల కలిగే నష్టాలను నివారించండి. భారతదేశ వృద్ధి కథనంలో నిబద్ధతతో పాల్గొనండి. ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయండి. గత అనుభవాల ఆధారంగా చూస్తే, దీర్ఘకాలిక పెట్టుబడులు సాధారణంగా మెరుగైన ఫలితాలను ఇస్తాయి. 2024 సంతోషంగా, సంపన్నంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

## పటిష్టంగా ఏషియన్ పెయింట్స్ అల్టిమా ప్రొటెక్ట్

విజయవాడ మేజర్ న్యూస్ : విప్లవాత్మకమైన బైయటి గోడ పెయింట్, అల్టిమా ప్రొటెక్ అనేది అల్టిమేట్ 'లామినేషన్ పెయింట్'గా నిలుస్తుంది. ఇది భారీ వర్షం, ఎండ, ధూళి నుంచి చాలా జాగ్రత్తగా కాపాడుతుంది. ఈ కొత్త ప్రకటనతో, అల్టిమా ప్రొటెక్ ఉత్తమ లామినేషన్ పెయింట్ అనే అంశాన్ని ఏషియన్ పెయింట్స్ బలపరిచింది. ప్రముఖ దక్షిణాది నటుడు, హాస్య నటుడు సతీష్ ముత్తుకృష్ణన్‌ను 'చంద్రు'గా చూపించిన ఈ ప్రకటన అల్టిమా ప్రొటెక్‌లోని అనూహ్య లక్షణాలను హాస్యభరితంగా చూపుతోంది. ఈ ప్రకటన అత్యాధునిక లామినేషన్ గార్డ్ టెక్నాలజీని కూడా హైలైట్ చేస్తుంది, ఇది వినియోగదారులకు దీనిని మఖ్య ఎంపికగా మారుస్తుంది.




## కోఆపరేటివ్ అధికారిగా ఫణి కుమార్‌కు అదనపు బాధ్యతలు



గుడివాడ, మేజర్ న్యూస్: జిల్లా కోఆపరేటివ్ అధికారి వి.వి ఫణి కుమార్ కు గుడివాడ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన విజయలక్ష్మిని అధికారులు సస్పెండ్ చేయడంతో, ఫణి కుమార్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.

# సమాజానికి రైతు వెన్నెముక







## ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి



కృష్ణలంక, మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో జై కిసాన్ – జై భారత్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'రైతు దేశానికి వెన్నెముక" అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ మన సమాజానికి రైతు వెన్నెముక దేశంలోని మొత్తం 60% మంది వ్యవసాయం పై నిమగ్నమైనారు. ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడంలో కీలకపాత్ర పోషిస్తారు. కష్టపడి పని చేసి ఎదురయ్యే పరిస్థితులను సవాలుగా తీసుకొని ప్రజలకు ఆహారం, వనరులను అందిస్తూ, జీవన వైవిధ్యాన్ని సంరక్షించడానికి దోహదం చేస్తారు. ప్రపంచానికి తిండి పెట్టి దేవుడు కాని ప్రస్తుత కాలంలో రైతు కష్టాన్ని ఎవరు గుర్తించడం లేదు, రైతు కష్టాన్ని గుర్తించి వారిని గౌరవించాలని, మనం ఒక్క రోజు వృధా చేసే ఆహార పదార్థాలు కొన్ని వందల మంది ఆకలి తీరుస్తుందన్నారు. విద్యార్థులు భారతదేశంలోని ప్రాంతాల వారిగా వేషధారణలు, ఆ ప్రాంతాలలో పండించే పంటలు కేరళ– కొబ్బరి, గుజరాత్, తమిళనాడు – వేరుశనగ, ఉత్తర ప్రదేశ్– జనపనార, మహారాష్ట్ర – పత్తి, కర్ణాటక – మొక్క జొన్న ఆంధ్రప్రదేశ్ – వరి పలు ముఖ్యమైన ప్రాంతాలలో పండించే పంటల గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.జి.యం – యం. మురళి కృష్ణ, ఆర్ఐ జె.రాజేష్ బాబు, అకడమిక్ డీన్ ఆర్.రవి, పాల్గొని, విద్యార్థులకు రైతు గొప్పతనం గురించి అవగాహన కలిగించారు.

## టీఎన్టీయూసీలో చేరిన కార్మిక నాయకులు, కార్మికులు



విజయవాడ, మేజర్ న్యూస్ : టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీఎన్టీయూసీ రా ష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘు రామరాజు అధ్యర్యంలో విజయవాడ పశ్చిమ నియోజక వర్గంకి చెందిన మాజీ సిఐటియు నాయకులు లింగంపల్లి మోహనరావుతో పాటు 125 మంది వివిధ రంగాలకు చెందిన కార్మిక నాయ కులు, కార్మికులు శుక్రవారం టీడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు సమక్షంలో టీడీపీ అనుబంధ సం ఘం టీఎన్టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం నడుస్తుంది. కార్మిక ద్రోహ ప్రభుత్వం పోవాలంటే కార్మికులందరూ కలిసికట్టుగా పోరాడాలి అని అన్నారు. కార్మి కుల పక్షాన టియన్‌టియుసి చాలా బలంగా పోరాడుతందని అన్నారు. మీ రు అందరూ కూడా టి యన్ టి యు సి నాయకులతో కలిసి ఈ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడండి అని పిలుపునిచ్చారు. లింగంపల్లి మోహన్ రావుతో పాటు టీయన్‌టియుసిలో చేరిన నాయకులు దేవాతు రమేష్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు, ఏం నరసింహారావు సిపిఎం సీనియర్ నాయకులు, వెంకటేశ్వరరావు ట్రాక్టర్స్ అండ్ టిప్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, కే. సైదులు ట్రాక్టర్స్ టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీనివాస్ చిట్టినగర్ పెయింటర్ అసోసియేషన్ కార్యదర్శి, ఏ గంగరాజు వన్ టౌన్ ఆటో యూనియన్ నాయకులు, లింగంపల్లి సీతారామయ్య మాజీ సిపి ఎం శాఖ కార్యదర్శి, ఎం డి ఇక్బాల్ హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, నెహ్రూ బాబు సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఎల్. రామ లక్ష్మి, శ్రామిక మహిళా నాయకురాలు, సరకటి కృష్ణప్రసాద్, చంటి, వంశీ, రామారావు, ఎల్ వామనేస్వర్ తదితర నాయకులు, పెద్ద యెత్తున కార్మికులు టి ఎన్ టి యు సి యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో టి యన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రెంటపల్లి శ్యామ్, కోగంటి లెనిన్ బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పాల మాధవ, శేషుబాబు, సూర్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.





## బి ఫార్మసీ విద్యార్థులు గర్వపడాలి

### జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా. జి గీతాభాయి

మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : బి ఫార్మసీ విద్యార్థులు తాము చదువుతున్న కోర్స్ గురించి గర్వంగా చెప్పుకోవాలి అని జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా జి గీతాభాయి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల బి ఫార్మసీ ప్రథమ సంవత్సరం లో చేరిన నూతన విద్యార్థులకు దిశా నిర్దేశ (ఇండక్షన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫార్మసీ విద్యార్థుల ఔషధాల గురించి పూర్తి స్థాయిలో జ్ఞానాన్ని సమపార్జించాలన్నారు. సదరు ఔషదం వాడకం వల్ల కలిగే ఉపయోగాలు తో పాటు జరిగే నష్టాలు కూడా తెలుసుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్ళల్లో వుంటే డాక్టర్ లు, నర్సులు, ఫార్మసీస్టులు ధైర్యంగా ముందుకు వచ్చి విధులు నిర్వర్తించారు అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న వారే జీవితంలో ముందుకు వెళతారని, ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆ దిశ గా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ డీన్ ఆచార్య మారుతి, ఫార్మసీ కళాశాల పి రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న ఎడ్ల పందాలు



పెదకాకాని మేజర్ న్యూస్ : పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామం నందు %యా= అటటతీఖ ుపజవశ్రీశీజూవతీం% ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి ఎడ్ల పందాలను తిలకించడానికి చుట్టుపక్కల జిల్లాల నుండి రైతులు తరలిరావడంతో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది అభిమానుల కేరింతల నడుమ పోటీలు కొనసాగుతున్నాయి పోటీలలో పాల్గొంటున్న ఎడ్ల జతలకు వారి యజమానులకు పోటీ నిర్వహకులు సకల సౌకర్యాలు అందజేస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొనటానికి కృష్ణ గుంటూరు ప్రకాశం నెల్లూరు కర్నూలు జిల్లాల నుండి ఎడ్ల జతలు ప్రాంగణానికి చేరుకున్నాయి పోటీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోటీల నిర్వాహకులు శ్రీనివాసరావు పలు ఏర్పాట్లు చేశారు.

## కేంద్ర మంత్రికి బిజెపి నేతల సత్కారం




మంగళగిరి, మేజర్ న్యూస్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయన ఎరువుల శాఖ మంత్రి మనసుఖ్ మండవీయ మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిని శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. మంగళగిరి బిజెపి నాయకులు ప్రవేశ ద్వారం వద్ద కేంద్రమంత్రి మనసుఖ్ మాండవీయ ను శాలువాలతో, ఫ్లవర్ బొకే లతో సాధారంగా స్వాగతించి సత్కారించారు. చిత్రపటాని బహుకరించారు. హాస్పిటల్ లో ప్రధాన సమస్యలను వినతి పత్రం ద్వార తెలియచేశారు. కేంద్ర మంత్రి సానుకూలం గా స్పందించి సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు .ఈ కార్యక్రమం లో మంగళగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ (చిన్నా) తుల్లిమిల్లి రామకృష్ణ, కొండా నవనీత్ కృష్ణా రెడ్డి, కోవిలాకారు రాకేష్, కొక్కిరాల యశోద కృష్ణ మునగాల నాగేశ్వర రావు, బుద్ధంటి కిరణ్ కుమార్ , పడమటి రాధాకృష్ణ, కాంద్రు భాను కిశోర్, తదితరులు పాల్గొన్నారు..

## ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



గుంటూరు, మేనేజర్ న్యూస్ : గుంటూరు నగరంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు వార్డ్ సచివాలయాల వారిగా గుర్తించిన క్రీడా మైదానాల్లో ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగుతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా నగరంలో వార్డ్ సచివాలయాల వారిగా వాలీబాల్, కబాడీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. క్రీడా పోటీలకు అవసరమైన కిట్స్ కూడా అందించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు తమ టీం కి మ్యాప్ చేసిన మైదానానికి కేటాయించిన సమయానికి రావాల న్నారు. నోడల్ అధికారులు పోటీల నిర్వహణ, ఫలితాల వెల్లడి పై ఎప్పటిక ప్పుడు శాప్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అడ్మిన్ కార్యదర్శులు సచివాలయంలో రిజిస్టర్ చేసుకున్న టీంలు నిర్దేశిత సమయానికి వచ్చేలా పర్యవేక్షణ చేసుకోవాలన్నారు. ఆసక్తి కల్గిన వారికి మైదానాల వద్ద స్పాట్ రిజిస్టర్ చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య అధికారులు క్రీడా మైదానాల వద్ద శానిటేషన్ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడలను చూడడానికి వచ్చే ప్రేక్షకులకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లతో నగరంలో జరిగే ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణలో ఏ సమస్య లేకుండా సమన్వయం చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు.

## బీసీ సంక్షేమ సంఘం దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉప్పాల అనందబాబు



మంగళగిరి, మేజర్ న్యూస్: బీసీ సంక్షేమ సంఘం దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా శృంగారపురంకు చెందిన ఉప్పాల ఆనంద్ బాబు నియామితులైయ్యారు. శుక్రవారం మంగళగిరి బైపాస్ రోడ్డులోని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు పాలేపల్లి మహేష్ ఉప్పాల అనందబాబుకు అందచేశారు. ఈ సందర్భంగా పాలేపల్లి మహేష్ మాట్లుడుతూ బీసీ సంక్షేమ సంఘాన్ని విస్తృతంగా బలోపేతం చేసే దిశగా కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, దుగ్గిరాల మండలం మహిళా అధ్యక్షురాలు మాది నాగ దుర్గ, ఆలా శివాజీ, ధనుంజయ్, ఉయ్యూరు రాజేశ్వరి, జై లక్ష్మీ, మాది వెంకటేశ్వరరావు, దానబోయిన సునీత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వరం జగనన్న విద్యా దీవెన



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : కొన్ని కొన్ని పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.. అవి ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేసిన వారికి కీర్తిని సంపాదించి పెడతాయి.. అలాంటి ఒక అద్భుత పథకమే జగనన్న విద్యా దీవెన అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కోఆర్డినేటర్ విశల్ వ్యాఖ్యానించారు. నిరుపేద విద్యార్థులకు గొప్ప వరమని ప్రకటించారు. జూలై-సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి 8,09,039 లక్షల మంది విద్యార్థులకు రూ.584 కోట్ల రూపాయల లబ్దిని చేకూరుస్తూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బటన్ నొక్కి విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాల్లో జమ చేసిన మనసున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు గుంటూరు విద్యార్థి లోకం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపింది. వినోద్, విశల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏసీ కళాశాల ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వినోద్, విశల్ మాట్లాడుతూ, పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతోనే జగనన్న విద్యా దీవెన పథకానికి సీఎం శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు తమ కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఈ పథకం ద్వారా 27.61లక్షల మంది విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద వారి తల్లుల ఖాతాల్లో జమ చేసిన సొమ్ము రూ.11,900 కోట్లు.. అని చెప్పడానికి తాము ఎంతో గర్విస్తున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం నేతలు రవి, భాను, విశాల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దీక్ష – అందరికీ రక్ష



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అందరినీ సన్మార్గంలో నడిపించడమే కాక మోక్షదాయకమైన శక్తి అయ్యప్ప స్వామి మాలధారణలో ఉందని ప్రభుత్వ విప్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. అందరికీ రక్ష అయ్యప్ప దీక్ష అని ఆయన వ్యాఖ్యానించారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆవరణలో మాలధారణ స్వాములకు గత 45 రోజుల నుంచి నిర్విఘ్నంగా కొనసాగిన సద్ది వితరణ కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిసింది. ఈ సందర్భంగా శరణు ఘోషతో మిర్చియార్డు ప్రాంగణం మార్మోగిపోయింది. గణపతి హోమం, అయ్యప్ప నామ సంకీర్తనలతో పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంతో.. భక్తిభావంతో అలరారింది. సద్ది వితరణ ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమంలో సేవ చేసిన వారికి లేళ్ళ అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వస్త్ర దానంతో ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, శరీరాన్ని, మనసును అదుపులో ఉంచే కఠినమైన నియమాలతో సాగే అయ్యప్పల అకుంఠిత దీక్ష వలన సర్వత్రా ఆధ్యాత్మిక చింతన పరిఢవిల్లుతుందని పేర్కొన్నారు. అంతేకాక మాల ధరించిన వారిలో సాత్విక భావనలతో పాటు ఆత్మ పరిశీలన శక్తి పెంపొందుతుందన్నారు. శబరిమల వాసుడైన అయ్యప్పను కఠోర నియమ నిష్ఠలతో ఆరాధించడం వలన జన్మ జన్మలకు పుణ్యఫలం లభిస్తుందన్నారు. 45 రోజుల పాటు శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానంలో ప్రతి రోజూ ఉదయం గణపతి హోమాలు, అభిషేకాలు, అష్టోత్తరాలు జరగడం శుభపరిణామమని ఆయన తెలిపారు. అత్యంత వైభవోపేతంగా పడిపూజ నిర్వహించి, నిత్య సద్ది వితరణ కొనసాగించి, సమాజ హితాన్ని కాంక్షించిన దేవస్థానం కమిటీ, మిర్చి ఫ్యామిలీని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మిర్చి యార్డులోని శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ఆలయ కమిటీ నిర్వాహకులు, మిర్చి ఫ్యామిలీ మెంబర్స్ కొత్తపల్లి శివసాంబిరెడ్డి, కోటా సాంబశివరావు, కుర్రి సాంబిరెడ్డి, కొత్తూరి సుధాకర్, లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, యలమంచిలి పుల్లారావు, వి.జి.టి.నారాయణరావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పొదిలి శ్రీనివాసరావు, గోపు శ్రీనివాసరెడ్డి, కార్మిక నేత ఎం.శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి వెంకట రమేష్‌కుమార్, డొంకెన బలరాం తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి ఇచ్చిన ఇవ్వకపోయిన సెమినార్ నిర్వహిస్తాం



తాడికొండ మేజర్ న్యూస్: వైస్ ఛాన్సిలర్ మాదిగల పట్ల వివక్షని విడనాడాలి తాడికొండ,మేజర్ న్యూస్:జనవరి 6న నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగనున్న మాదిగ విద్యార్థి సమాఖ్య సెమినార్ అనుమతిపై వైస్ ఛాన్సిలర్ రాజశేఖర్ పక్షపాత ధోరణి అనుచిత విధానాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రం గా ఖండిస్తుందని జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జిల్లా ఇన్చార్జ్ మంద వేం కటేశ్వర రావు పేర్కొ న్నారు. తుళ్లూ రు మండలం లోశుక్రవా రం విలేఖరుల సమా వేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా మంద వేంకటేశ్వర రావు మాదిగ మాట్లా డుతూ గతంలో వైజాగ్, తిరుపతి ఆంధ్రయూనివర్సిటీ,శ్రీ వెంకటేశ్వ ర యూనివర్సిటీలలో జాతీయ సెమినార్లు మంద కృష్ణ మాదిగ నిర్వహించారని,నేడు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే మీటింగ్ కి అనునతి ఇవ్వకపోవడంపై ఉద్దేశ్యపూర్వకంగా వైస్ ఛాన్సిలర్ వ్యవహరిస్తున్నారన్నారు. అనుమతి ఇచ్చిన ఇవ్వకపోయిన జాతీయ మాదిగ విద్యార్థి సమాఖ్య సెమినార్ ను నిర్వహించి తీరుతామని, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వేమూరి సుధీర్ మాదిగ,ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు మురికిపూడి హృదయరాజ్ మాదిగ, తోడేటి ఏసుపాదం మాదిగ,పల్లెపోగు రాజారావు మాదిగ,డేగల బాబు మాదిగ,పల్లెపోగు థామస్ మాదిగ,యద్దనపూడి జ్యోతి మాదిగ, యేసుపోగు శ్యామల మాదిగ,కంభంపాటి వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొన్నారు.




## అభివృద్ధిలో ఇంటర్నెట్ పాత్ర ఎంతో కీలకం

**జిల్లా కలెక్టర్ రాజా బాబు**

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఇంటర్నెట్ రంగంలో దేశ వ్యాప్తంగా పేరు గాంచిన ఆక్ట్ ఫైబర్ నెట్ తమ సేవలను మచిలీపట్నం కి తీసుకొచ్చింది వన్ గిగా స్పీడ్ టెస్ట్ చేసి ఆక్ట్ ఫైబర్ నెట్ సేవలను జిల్లా కలెక్టర్ రాజా బాబు ప్రారంభించారు. బందర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో జరిగిన ఆక్ట్ ఫైబర్ నెట్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రాడ్ బ్యాండ్‌లో ఆక్ట్‌కు మంచి పేరుందని అన్నారు. బందరులో ప్రారంభించడం సంతోషమన్నారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా, విద్య, వాణిజ్య పరంగా జిల్లా అన్నీ విధాలు గా అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనేక ప్రముఖ నగరాల్లో ఆక్ట్ ఇప్పటికే అత్యంత వేగమైన నాణ్యమైన బ్రాడ్ బ్యాండ్ సేవలు అందిస్తున్నదని అభినందించారు. కార్యక్రమం లో డిఎస్పీ వై మాధవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, ఆక్ట్ వైస్ ప్రెసిడెంట్ దువ్వూరి యుగంధర్, ఆపరేషన్ హెడ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి



**పెడన, మేజర్ న్యూస్ :** రాబోయే ఎన్నికలకు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎటు వంటి అసౌకర్యం కల్పకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె పట్టణంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సరైన పెంటిలేషన్ తాగునీరు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులు పరిశీలించామన్నారు. దీనిపై అధికారులతో సమీక్షించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఏసుబాబు, రెవెన్యూ అధికారులు, సచివాలయ అధికారులు తదితరులు ఉన్నారు.

## గుడివాడ డివిజనల్ కోఆపరేటివ్ అధికారిణి సస్పెండ్




**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ కోఆపరేటివ్ అధికారిణి డి.విజయలక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఆశాఖ కమీషనర్ బాబు.ఎ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. అవినీతి ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో ఆమెను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. విజయలక్ష్మి వ్యవహార శైలిపై అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.

## ముగిసిన గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఎ సింహాద్రి రరమేష్ బాబు మాట్లాడుతూ సుదీర్ఘ ప్రయాణంలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎన్నో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 77 సచివాలయాలను 1601 వాలంటీర్లతో కలిసి 93,417 గృహాలను సందర్శించడం జరిగిందని గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్నటువంటి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. గడప గడపకి మన ప్రభుత్వం ద్వారా ఒకొక్క సచివాలయానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి 20 లక్షల రూపాయలు మంజూరు చేయగా వాటి ద్వారా సచివాలయ పరిధిలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా నియోజకవర్గ పరిధిలో 15.40 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, సచివాలయాల పరిధిలో మిగిలిపోయినటువంటి సమస్యలను పరిష్కరిస్తూ ఇదే విధంగా ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు.

# ఉన్నత చదువుల వారధి.. జగనన్న విద్యా దీవెన



### పథకాన్ని సద్వినియోగం చేసుకొని మంచి కెరీర్‌ను సొంతం చేసుకోవాలి

### పథకం ద్వారా నాలుగో త్రైమాసికంలో 31,482 మందికి రూ. 25.53 కోట్ల లబ్ధి

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** గతంలో ఎన్నడూలేని విధంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తోందని.. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు విద్యార్థులకు సూచించారు. 2023, జులై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జగనన్న విద్యా దీవెన జిల్లాస్థాయి కార్యక్రమం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగించి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజు మొత్తాన్ని జమచేసిన అనంతరం కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం మెగా చెక్‌ను విద్యార్థులకు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ రంగంలో విప్లవాత్మక కార్యక్ంమాలు, పథకాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలు పేద కుటుంబాల పిల్లల ఉన్నత చదువులకు అడ్డం కాకూడదనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ఫీజులు చెల్లించేందుకు సమయానికి చేతిలో డబ్బులు లేక పడే ఇబ్బందులు ఏమిటో తనకు తెలుసునని పేర్కొన్నారు. అలాంటి ఇబ్బందులు పేద కుటుంబాల పిల్లలకు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో, విద్య ద్వారా పేదరికాన్ని రూపుమాపాలనే గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మంచి స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని సూచించారు. జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

**క్రమం తప్పకుండా పథకం ద్వారా లబ్ధి:** జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమంతప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు ఇచ్చేలా వారి తల్లుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమచేస్తోందని కలెక్టర్ డిల్లీరావు వివరించారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద 2023, జులై–సెప్టెంబర్ త్రైమాసికానికి ఎన్‌టీఆర్ జిల్లాలో 31,482 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 25.53 కోట్లు జమవుతున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. 9,735 మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 7,18,10,145 లబ్ధి, 1,083 ఎస్టీ విద్యార్థులకు రూ. 88,95,866 లబ్ధి, 11,759 మంది బీసీ విద్యార్థులకు రూ. 9,50,35,291 లబ్ధి, 4,031 మంది ఈబీసీ విద్యార్థులకు రూ. 3,95,59,816 లబ్ధి, 1,948 మంది ముస్లిం విద్యార్థులకు రూ. 1,52,02,319 లబ్ధి, 2,726 మంది కాపు విద్యార్థులకు రూ. 2,28,89,940 లబ్ధి, 200 మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ. 18,65,350 మేర లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ డిల్లీరావు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.శివరామకృష్ణ, భట్రాజ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బీవీ విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు హాజరయ్యారు.




### జగన్ రెడ్డి ఇచ్చినవాగ్దానాలు గుర్తు చేస్తూ, బుక్కు రూపంలో

## ప్రజలకు, ప్రతి ఇంటికి వెళ్లి అందజేస్తాం

**మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా**

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్:** సి ఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో ఆనాడు ఒక సభలో ప్రసంగిస్తూ,ప్రజలకు ఇచ్చినవాగ్దానాలు ఏమిటో గుర్తు చేస్తూ, ఒక బుక్కు రూపంలో ప్రజలకు, ప్రతి ఇంటికి వెళ్లి అందజేస్తాంమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ శాసనసభ్యు లు బొండా ఉమమహేశ్వర రావు తెలిపారు. శుక్రవారం బొండా ఉమ విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోండా ఉమ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేసినటువంటి పాదయాత్రలో గాని,రాష్ట్రం మొత్తం మీద అనేక సభలు పెట్టి గాని జగన్మోహన్ రెడ్డి ఇచ్చినటువంటి వాగ్దానాలు ఆరోజు నేను ఎన్నికల మేనిఫెస్టో ప్రకటిస్తున్నాను అని,ఈ ఎన్నికల మేనిఫెస్టో నాకు బైబిల్ లాంటిదని, కురాన్ లాంటిదని,, భగవద్గీత లాంటిదని,నేను మాట తప్పను మడమ తిప్పను అని,అనేక మైన మాటలు,వాగ్దానాలు చెప్పి, ప్రజలను నమ్మించి ఓట్లేపించుకొని అధికారంలోకి వచ్చాకదాదాపు 4 సంవత్సరాల9 నెలలు పూర్తవుతుందని,ఇంకో మూడు రోజుల్లో 2024 కొత్త సంవత్సరం వస్తా ఉన్నదని,ఇంకా మూడు నెలల్లో ఈ ప్రభుత్వ కాల పరిమితి కూడా అయిపోతా ఉందని, మరల ఎన్నికలు వస్తున్నాయని, ఈసారి జగన్ మోహన్ రెడ్డిని,రాష్ట్ర ప్రజలు ఇంటికి పంపిస్తారని పేర్కొన్నారు. అమ్మవాడి పథకం కింద కుటుంబంలో ఎంతమంది ఉన్నా సరే డబ్బులు ఇస్తానని జగన్, ఈరోజు కుటుంబంలో ఒక్కరికే వస్తుందని చెప్పి, ప్రజలను దారుణంగా మోసగించారని, ఏ కార్పొరేషన్ లో కూడా పైసా లేకుండా కార్పొరేషన్ నిర్వీర్యం చేసిన చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఏఎంసి ఏఎంసి డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, గడ్డం రాజు,బత్తుల కొండ,మాచర్ల గోపినాథ్,దొంగర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు ప్రచారం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తూ వివరించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఆద్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారింటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మహనాడు వేదికగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలైన మహా శక్తి పథకాలు, అన్నదాత సుఖీభవ, యువగళం నిధి, ఇంటింటికి మంచి నీరు, బిసి రక్షణ చట్టం గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. చంద్రబాబు పేదల కోసం వారి కడుపులు నింపడం కోసమే చంద్రబాబు తెచ్చిన అన్న క్యాంటిన్‌లు, పండుగ కానుకలు, పెళ్ళి కానుక వంటి పథకాలను అమలు చేశారని, అటువంటి పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి పేదల మనిషా అని ప్రశ్నించారు. పేదవారు బాగుండాలన్నా, కడుపు నిండా తిండి తినాలన్నా చంద్రబాబు అధికారంలోనికి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపి లోని పాలన అభివృద్ధి, వినాశనం గురించి పొరుగు రాష్ట్రాలు హేలన చేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డికి కనీసం సిగ్గు అనిపించడం లేదా అని ఆర్.టి.సి చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్న జగన్‌కు పేదల మనిషి అని చెప్పుకునే అర్హత లేదన్నారు. జగన్‌రెడ్డిని రాష్ట్రం నుండి తరిమి కొట్టేందుకు ప్రజలంతా సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎం.పి.పి బండె కనకదుర్గ, పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బిసి నాయకులు లుక్కా శ్రీనివాసరావు, మోగావత్తు గోపి, మైలా హరిబాబు, యలవర్తి ఆది, బర్మా శ్రీను, కోట సాయి, రేపల్లె అంకినీడు, కొండవీటి గోవిందులతో పాటు కనగాల రాధ, కమ్మిలి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరచడంలో 85% విఫలమయ్యారు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరచడంలో 85% విఫలమయ్యారంటు బుక్ ను ఆవిష్కరణ చేసిన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకృష్ణ. ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు 99.5% అమలు చేశారని ప్రతి సభలో పదే పదే చెప్పి డబ్బా కొట్టుకుంటున్నారు జగన్ మోహనరెడ్డి తీరును నిరసిస్తూ కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, జనసేన మచిలీపట్నం ఇంచార్జి బండి రామకృష్ణ మచిలీపట్నం పార్లమెంట్ కార్యాలయం లో జగన్ ఇచ్చిన హామీల అములులో 85% విఫలమయ్యారంటు విలేకరుల సాక్షిగా జగన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించిన బుక్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలు ఎన్నికల మేనిఫెస్టో, జగన్మోహన్ రెడ్డి చేసిన పాదయాత్ర సమయంలో నియోజవర్గాలలో ఇచ్చిన హామీలు మొత్తం సుమారుగా 730 హామీలు ఉంటే దానిలో పూర్తిగా పట్టుమని 20 హామీలు అదేవిదంగా పాక్షికంగా 88 హామీలు మాత్రమే నెరవేర్చి అంటే సుమారుగా 15% మాత్రమే అమలు చేసి హామీలన్నీ నెరవేర్చారని చెప్పేసి అబద్ధాలు చెప్పుకుంటున్నారు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. వెబ్సైట్ నుంచి టిడిపి మేనిఫెస్టో తొలగించారని చెప్పిన అబద్దమే వందసార్లు చెబుతున్నారు కానీ టిడిపి మేనిఫెస్టో నేటికి ఎలక్షన్ కమిషన్ వెబ్సైట్లో ఉంది అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా అదనంగా చేసిందనేది నిజం అందుకే నేడు అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు నాయుడు కి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో నవరత్నాల గురించి మాట్లాడుకుంటే నవరత్నాల్లో సుమారు ఏడు హామీలు కాస్త కోస్తా అమలు చేసి మిగిలిన రెండు హామీలైన జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి, మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని చెప్పి అసలు వీటి గురించి పట్టించుకోకుండా ఎలా హామీలన్నీ 99% అమలు చేశారని వైసీపీ నాయకులు చెప్పుకుంటున్నారన్నారు. అదేవిధంగా మైనారిటీల ఓట్లు కోసం మైనారిటీ వక్ఫ్ బోర్డ్, ముస్లిం మైనారిటీల స్థిరాక్షర ఆస్తుల రీ సర్వే డిజిటల్ చేస్తానని అలాగే మసీదులో ఇమామ్ మౌజన్ లకు గౌరవ వేతనం కోసం నెలకు 15000 ఇస్తానని చెప్పి నేడు వాటిని అమలు చేయలేదు. మరి ముఖ్యంగా ప్రభుత్వ ఓట్ల కోసం సుమారు 20 దాకా హామీలు ఇచ్చి వాటిలో సిపిఎస్ రద్దు, సమాన పనికి సమాన వేతనం ప్రతిపాదికన ఔట్సోర్సింగ్ వారికి న్యాయం చేస్తానని, పోలీస్లకు వీక్లీ హాఫ్ అమలు చేస్తానని ఇలా చాలా హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లను కొల్లగొట్టారన్నారు. ఇచ్చిన హామీలలో కేవలం 15% మాత్రమే అమలుపరిచి మొత్తం 99% అములుపరిచామని జగన్మోహన్ రెడ్డి, వైసిపి నేతలు ప్రసంగాల ద్వారా డప్పు కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు( బుల్లయ్య), రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహ కార్యదర్శిబచ్చుల సుబ్రహ్మణ్యం(బోస్), జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్,జిల్లాఅధికార ప్రతినిధి తలారి సోమశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి లంకే శేషగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి పివి ఫణి కుమార్,, జిల్లా కార్యదర్శి వంపుగాడల ఫ్రెన్సిస్ (పండు ),టౌన్ పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, జనసేన పట్టణ అధ్యక్షులు గడ్డం రాజు, టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, 19వ వార్డు కౌన్సిలర్ దేవరపల్లి అనిత, లంకె హరి, మాజీ కౌన్సిలర్ కాసాని భాగ్య రావు, భీమవరపు పరమేశ్వరరావు, నాగేశ్వరావు తదితర తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకులకు క్రిష్ణా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల యన్.సి.సి విద్యార్థిని ఎంపిక



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఢిల్లీ లో నిర్వహించే గణతంత్ర వేడుకలకు క్రిష్ణా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని, 16 ఆంధ్ర బెటాలియన్ యన్.సి.సి క్యాడెట్ టి. లక్ష్మి దమయంతి ఎంపిక అయినట్లు కళాశాల ఏ.యన్.ఓ లెఫ్టనెంట్ డా. డి. రామ శేఖర రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ లో నిర్వహించిన ఏడు శిక్షణ శిబిరాలలో పది వేల మంది కాడట్స్ పాల్గొన్న శిబిరాలలో ఉత్తమ ప్రతిభ కనబరించిందన్నారు. కృష్ణా విశ్వ విద్యాలయంలో 2021 లో ఎన్.సీ.సీ విభాగం ఏర్పాటు చేశారని, ఎన్.సీ.సీ విభాగం స్థాపించి కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే డ్రిల్ విభాగంలో గణతంత్ర వేడుకలకు అందునా ఒక విద్యార్థిని ఎంపిక అవ్వడం ఆనందంగా ఉందని లెఫ్టినెంట్ డాక్టర్ డి. రామ శేఖర రెడ్డి తెలిపారు. ఎన్.సీ.సీ విభాగం పురోగమించడానికి, విద్యార్థులు ఎన్.సీ.సీ లో ఉత్తమ ప్రదర్శన సాధించడానికి విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞాన మణి ప్రోత్సాహం ధోహదపడిందని లెఫ్టనెంట్ డాక్టర్ డి. రామశేఖర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి దమయంతి ని ఉపకులపతి ఆచార్య జ్ఞాన మణి, రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మ చారి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్.విజయకుమారి, 16వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సంసార్ సింగ్ అభినందించారు.

## అంగన్‌వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్యాడ్యువిటీల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆద్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం 18 వ రోజు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి మోసగించారని, మా మెర ఒక్క సారి ఆలకించి మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ మహిళా యూనియన్ నాయకులు, సిఐటియు సభ్యులు పాల్గొన్నారు.




## దురుద్దేశంతోనే కో ఆపరేటివ్ అధికారిణిని సస్పెండ్ చేశారు

**గుడివాడ, మేజర్ న్యూస్:** జగన్ రెడ్డి ప్రభుత్వంలో అధికారులకు భద్రత లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ గుడివాడ పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ కోఆపరేటివ్ అధికారిణి సస్పెండ్ ను ఖండిస్తూ టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులు ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించుకున్నారని రాంబాబు ఆరోపించారు. గుడివాడ డివిజన్ కోపరేటివ్ అధికారిణి టి.విజయలక్ష్మి వైసిపి నాయకుల కారణంగానే సస్పెన్షన్ కు గురైందని తెలిపారు. జగన్ రెడ్డి తండ్రి రాజశేఖర్ రెడ్డి కారణంగా గతంలో ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలు పాలయ్యారని ఈ సందర్భంగా దింట్యాల గుర్తు చేశారు. గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని, దుక్కిపాటి శశిభూషణ్ లు చెప్పిన విధంగా అధికారులు నడుచుకుంటున్నారని, వారికి కూడా భవిష్యత్తులో ఇదే పరిస్థితి వస్తుందని దింట్యాల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందివాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, పోలసి ఉమయ్యులు పాల్గొన్నారు.

## పైడమ్మతల్లి సంబరాల ఏర్పాట్లు భేష్



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పెడన పట్టణము లో పైడమ్మ తల్లి సంభరాలు 4వ రోజూ శుక్రవారం చాలా ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం బార్ అసిసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, 15వ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆలయాని సందర్శించి అమ్మవారికి వస్త్రాలు, పూలమాలలు పసుపుకుంకుమ అందించారు. దేవాలయ ఇ.ఓ తిక్కిశెట్టి రామోహనరావు, దక్షిణ తెలుగుపాలెం కౌన్సిలర్ సిరివెళ్ల జయేష్ లంకిశెట్టి దంపతులకు ఆలయసిబ్బందిచె అశీర్వచనం అందచేశారు. ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం తోట వారి ఆడపడుచుగా పెడన లో వెలిసిన పైడమ్మ తల్లి సంభారాలకోసం వస్తున్న భక్తులకు దేవాదాయ శాఖ వారు మంచి ఏర్పాట్లూ చేశారని అన్నారు. పోలీస్, మున్సిపల్ సిబ్బంది, వైద్య విధ్యుత్ శాఖ చక్కటి ఏర్పాట్లు చేశారని అన్నారు. భక్తులకు రాత్రివేళ వివిధ వినోదా కార్యక్రమాలూ కూడా ఏర్పాటు చేశారు. లంకిశెట్టి దంపతులు అన్నదానానికి ఆర్థిక సహాయం అందచేశారు.



## మిక్ కళాశాలలో ప్రారంభమైన జేఎన్టీయూ క్రికెట్ జట్టు ఎంపిక

**కంచికచర్ల డిసెంబర్ 29 మేజర్ న్యూస్ :** కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ క్రికెట్ జట్టు ఎంపిక ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియలో జెఎన్టియుకె పరిధిలోని ఐదు జిల్లాలకు సంబంధించి 35 కళాశాలలకు చెందిన మొత్తం120 క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియకు జే యన్ టి యు నరసరావుపేట నుండి డాక్టర్ జిపి రాజుతో పాటు సెలక్షన్ కమిటీ మెంబర్స్ గా ఎన్ వీ రాజ్ కుమార్, వివి ఫణీంద్ర వ్యవహరిస్తున్నట్లు మిక్ ఇంజనీరింగ్ కళాశాల పిడి నిమ్మగడ్డ సౌరయ్య తెలిపారు. ఎంపిక కాబడిన జట్టు మిక్ కళాశాలలో శిక్షణ పొంది జనవరి 7 నుండి తమిళనాడు హిందుస్థాన్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. సెలక్షన్ ప్రక్రియను కళాశాల యాజమాన్య సభ్యులు ఎం. సుహాస్, సీఈఓ డి. పాండు రంగారావులు ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు పీడీలు ఎస్ సురేష్, వెంకటరమణలు పాల్గొన్నారు.

## ముగిసిన సచివాలయాల స్థాయి పోటీలు



**గన్నవరం, డిసెంబర్ 29, మేజర్ న్యూస్ :** ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగం గా గన్నవరం మండలం లో శుక్రవారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో పురుషుల వాలీబాల్, మహిళల ఖో ఖో పోటీలు జరిగాయి. అలాగే కేసరపల్లి లో క్రికెట్, ఖో ఖో, ముస్తాబాద లో షటిల్, బాడ్మింటన్, సూరంపల్లిలో ఖో ఖో పోటీలు గన్నవరం యం పి డి ఓ సత్య కుమార్ పర్యవేక్షణలో ఉత్సాహంగా నిర్వహించినట్లు గన్నవరం నియోజకవర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది సహకారం తో పోటీలు విజయ వంతంగా కొనసాగుతున్నట్లు నాగరాజు తెలిపారు. కాగా దావాజీగూడెం, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలలో సచివాలయాల స్థాయి పోటీలు ముగిసినట్లు ధనియాల వివరించారు.

## జనవరి నుంచి సామాజిక పింఛను రూ.3వేలకు పెంపు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని వచ్చే జనవరి నుంచి రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచనుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారుజి.కొండూరు మండలంలోని కోడూరు గ్రామంలో రూ.43.6 లక్షల వ్యయంతో సచివాలయం భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభించారుఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం క్రమానుగుణంగా పింఛన్లు పెంచారని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800 కోట్లకు పైగా ఖర్చుచేస్తుండగా.. జనవరి నుంచి జరిగే పెంపు అనంతరం అది దాదాపు రూ.2,000 కోట్లకు పెరిగే అవకాశముందన్నారు. ఈ డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,33,781 మంది పింఛన్ ద్వారా లబ్ది పొందారని అన్నారు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగనన్న సాకారం చేశారని పేర్కొన్నారు. 500లకు పైగా సేవలను సచివాలయంలో అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల రక్షణకై సమిష్టి కృషి చేయాలి



తుళ్లూరు మేజర్ న్యూస్ : బాలల హక్కుల రక్షణకై అందరూ సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని గుడ్ షెఫర్డ్ సిస్టర్ లత పేర్కొన్నారు శుక్రవారంతుళ్లూరు గ్రామంలోని వార్డు సచివాలయం నందు గుడ్ షెఫర్డ్ సంస్థ వారి ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ అండ్ వైలేషన్స్ గురించి మీడియా ప్రతినిధులతో, వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో గుడ్ షెఫర్డ్ సంస్థలోని డైరెక్టర్ సిస్టర్ లతా మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలల హక్కుల రక్షణకై, మహిళల హక్కుల రక్షణకై నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. అలాగే మీడియా సహకారం ఎంతో ముఖ్యమైనది అని కొనియాడారు. అలాగే పంచాయతీ సెక్రటరీ దీప్తి మాట్లాడుతూ గుడ్ షెఫర్డ్ సంస్థ చేస్తున్న ప్రతి కార్యక్రమంలో తాము కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిస్టర్ లతా, పంచాయతీ సెక్రెటరీ దీప్తి, మహిళా పోలీసులు లక్ష్మీప్రసన్న, శిరీష , మీడియా ప్రతినిధులు, వార్డు సచివాలయ సిబ్బంది, గుడ్ షెఫర్డ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా గూడవల్లి గంగాధర్ ఎంపిక



పొన్నూరు మేజర్ న్యూస్ : ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యునిగా పొన్నూరు పట్టణానికి చెందిన గూడవల్లి గంగాధర్ ఎన్నికయ్యారు. తెనాలి సబ్ కలెక్టర్ నేతృత్వంలో ఈ నెల 30న తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం నందు అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నూతనంగా ఎన్నికైన గూడవల్లి గంగాధర్ తెలిపారు. సభ్యులుగా ఎన్నికైన మరో ముగ్గురిని గంగాధర్‌తో పాటు అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన గూడవల్లి గంగాధర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల కోసం తన వంతు పోరాటం సాగిస్తానన్నారు. ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే విధంగా తాను కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## దృఢ సంకల్పంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ లేదు



పొన్నూరు మేజర్ న్యూస్ : విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధతో పని పట్ల ఆసక్తితో ముందు సాగితే సాధించలేనిది ఏమీ లేదని ప్రముఖ రచయిత దర్శకుడు వెంకట్ పేర్కొన్నారు.స్థానిక వెలగానాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రాంగణంలో శుక్రవారం మోటివేషన్ ప్రోగ్రాం జరిగింది కాలేజ్ సెక్రటరి అయిన శ్రీమతి వెలగా నాగకళ్యాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీ ఇండస్ట్రీ ప్రముఖ రచయిత దర్శకుడు కోన వెంకట్ మాట్లాడుతూ మనిషి యొక్క జీవితంలో ఒక్క అవకాశమే కాదు, 100 అవకాశాలు ఉంటాయన్నారు. ఉన్న అవకాశాలను మన చేత్తో మనమే అందిపుచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. దీనికి ఉదాహరణగా వారి జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలను ఇలా వివరించారు. వారు డైరెక్ట చేసిన నిన్ను కోరి మూవీ గురించి, ఆ మూవీ చూసి ఒక అమ్మాయి జీవితంలో జరిగిన సత్యాలను ఒక మెయిల్ ద్వారా పంపిన విషయాన్ని గూర్చి విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తుకు సంబంధించి స్కిల్స్ డెవలప్ చేసోకోమని, మనసుకు నచ్చిన పనిని హృదయపూర్వకంగా పనిచేసినప్పుడే సక్సెస్ అనేది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఏదో ఒకదానిపై మాత్రమే ఆధారపడకుండా ఉన్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కాలేజ్ సెక్రటరి వెలగా కళ్యాణి, సినీ ఇండస్ట్రీకి సంబంధించిన శ్రీమన్నారాయణ.. ప్రిన్సిపల్ యు గణేష్, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ లు అందించిన ఎస్పీ



గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ శుక్రవారం వారికి ఫోన్లు అందజేశారు. సుమారు రూ. 28.5 లక్షల విలువైన 117 వివిధ బ్రాండ్ల కంపెనీ మొబైల్స్ ను రికవరీ చేసి అందించారు. ఐటీ కోర్ టీమ్ నోడల్ అధికారి సుప్రజ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన సెల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సంబంధించిన వాట్సప్ నెంబర్ 8688831574 కు ఐ ఎం ఐ నంబర్ తో కూడిన వివరాలు పంపిస్తే కేసులు నమోదు లేకుండా సెల్ ఫొన్ రికవరీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా బాధితులు ఇక దొరకదు అనుకున్న ఫోన్ తిరిగి తమకు అందడంతో ఎస్పీ ఎదుట హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేర విభాగం ఏఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ బిల్లుకు చదువుకు సంబంధం ఏంటి జగన్ రెడ్డి : మొహమ్మద్ నసీర్‌లి



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజక వర్గం 7వ డివిజన్ పొత్తూరి వారి తోట ప్రాంతంలో ఇంటిటికీ తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చాక ఇచ్చే సంక్షేమ పథకాలును స్థానిక టీడీపీ జనసేన నాయకులు తో కలిసి వివరించిన గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ప్రజల కు అంధవలసిన సం క్షేమ పథకాలలో అర్థం పర్థం లేని కార ణాలతో ఈ వైసీపీ ప్రభుత్వం కోతల విధిస్తుందని ముఖ్య ంగా విద్యార్థులు చదువుకు ఇచ్చే అమ్మ ఒడిలో కరెంట్ బిల్లు వచ్చిందని , కారు ఉందనో వాటిని కట్ ఇవ్వకుండా ఆపుతున్నారని గతంలో చంద్రబాబు నాయుడు గారు విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్లను, ఫీజు రియంబర్స్మెంట్లను పేరు మార్చిన జగన్ రెడ్డి అవి అందించడంలో విఫల మయ్యాడని పారిశుధ్య కార్మికులకు, కాంట్రాక్ట్ ఉద్యోగస్తులకు ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాలను వారికి రాకుండా చేస్తున్నాడని ముఖ్యంగా అవాతాతలకు ఇచ్చే పెన్షన్లు గతంలో 54 లక్షల మందికి ఇస్తే జగన్ రెడ్డి వచ్చాక ఆరు లక్షల మందికి కోతల విధించాడని మైనారిటీ ఆడబిడ్డలకు దుల్హాన్ పథకం కింద ఇచ్చే పెళ్ళి కానుక నాలుగు సంవత్సరాల నుంచి ఆపేసి కొత్తగా ఆంక్షలులతో అందకుండా చేశాడని సంక్షేమ పథకాలను సరిగా అందించలేని ఈ అసమర్థ సీఎంని గద్దె దించడానికి ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు ఖుదూస్, %ాఖ% ఉస్మాన్, కొనకళ్ల సత్యం, మారం కిషోర్, పల్లా సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, రాంబాబు, బాబ్జి, షేక్ జాఫర్, సత్యనారాయణ, P విజయ్, అబ్జాల్, షేక్ అబ్దుల్లా, మన్యం శ్రీను, అన్వర్, ఖరీముల్లా రెహమునిస, జమీర్, ఫరూక్ జనసేన నాయకులు లిరజాక్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీలకు అండగా ఉంటాం



గుంటూరు జిల్లా. నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అంగన్వాడీలకు సమస్యల పరిష్కారంలో చేస్తున్న ఉద్యమానికి అండగా ఉంటామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు చేపట్టిన ధర్నాకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపారు. జనసేన, తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 18 రోజులుగా మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన బాటపట్టినా మహిళామంత్రులు స్పందించకపోవడం దారుణమన్నారు. జిల్లాకు చెందిన మంత్రి విడుదల రజని అంగన్వాడీలను పలకరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ధర్నాకు తెదేపా రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌అలీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు మద్దతు తెలిపారు.

# నేరాల నియంత్రణపై దృష్టి - జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: జిల్లాలో నేరాల నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ స్పష్టం చేశారు. దీనివల్ల కేసుల సంఖ్య తగ్గిందని చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి వార్షిక నివేదికను వెల్లడించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసినట్లు సాధారణ కేసులు 1195 నమోదు కాగా 517 కేసుల్లో పురోగతి సాధించామని వెల్లడించారు. సుమారు రూ. 5.38 కోట్ల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అందించినట్లు సూచించారు. మొత్తం 45 హత్య కేసు జరిగాయని, కుటుంబ గొడవలు, వివాహేతర సంబంధాలు వల్ల హత్యలు జరిగాయన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి 131 నమోదయినాయని, చీటింగ్ కేసులు 716, చిన్నారుల కిడ్నాపింగ్ 24 కేసులు నమోదయినట్లు పేర్కొన్నారు. ఎన్నడూ లేని విధంగా రౌడీ షీటర్లు, గంజాయి, మద్యం కేసుల్లో 16 మందిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు సూచించారు. భారీ చోరీలకు సంబంధించి 29 కేసులు నమోదు కాగా... 22 కేసులు ఛేదించినట్లు చెప్పారు. ఎక్సైజ్ కేసులకు సంబంధించి 408 కేసుల్లో 442 మందిని అరెస్ట్ చేసామని, 38 వాహనాలు సీజ్ చేసామన్నారు. రేప్ కేసులు 101, ఫొక్సో కేసులు 153 నమోదయ్యాయి. జిల్లాలో 1605 మంది రౌడీ షీటర్లు ఉన్నారని ఎస్పీ వివరించారు. రమ్య, తపస్వి హత్య కేసుల్లో నిందితుల అరెస్ట్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టిసాదించామన్నారు. ఎక్కడైనా సిబ్బంది పనితీరు పై ఆరోపణలు వచ్చిన వెంటనే వారిని అక్కడి నుండి మార్చుతామన్నారు. కొత్తపేట బంగారం చోరీ కేసులో బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసామన్నారు. నైట్ బీట్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సూచించారు. నేరాల తగ్గుముఖములో గుంటూరు జిల్లా రెండవ స్థానంలో ఉందని ఈ సందర్భంగా ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ సుప్రజ, నేర విభాగం ఏఎస్పి శ్రీనివాసరావు, ఏ ఆర్ ఏఎస్పి కోటేశ్వరరావు, ఎస్ బి డిఎస్పి రత్న స్వామి, ఎస్పి సి.సి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.





# నారాయణలో ఘనంగా మాస్టర్ ఆరేటర్ సెమీఫైనల్స్

## హాజరైన అన్ని బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, ఏవోలు - అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు - రాణించిన విద్యార్ధులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేత



గుంటూరు, మేజర్‌న్యూస్: గుంటూరు ఎస్‌విఎన్ కాలనీ నారాయణ విద్యాసంస్థలో గుంటూరు నగర పరిధిలోని నారాయణ విద్యాసంస్థల మాస్టర్ ఆరేటర్ సెమీ ఫైనల్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సౌత్ కోస్ట్ ఆర్‌జిఎం శ్రీనివాసులురెడ్డి, గుంటూరు-2 ఏజిఎంలు శివనాగరాజు, జానకి రామిరెడ్డి, ఆర్‌ఎస్‌జెడ్ శ్రీని, జెడ్‌సివోహెచ్‌ఎస్ సీతారాం, జెడ్‌సివోఎస్ అనుపమ, షమీమ్, అన్ని బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, ఏవోలు



హాజరయ్యారు. మాస్టర్ ఆరేటర్ సెమీఫైనల్‌లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు వారి ప్రతిభను ఎంతో చక్కగా ప్రదర్శించారు. సంభాషణలకు అనుగుణంగా హావభావాలను, మోడల్స్‌ను చూపారు. ముఖ్యఅతిథి శివనాగరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమని, దీని ద్వారా విద్యార్థిని, విద్యార్థులు మంచి వక్తలుగా, నైపుణ్యత దిశగా వృద్ధి చెందుతారని అందుకు కారకులైన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెమీ ఫైనల్స్‌లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



# అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు.. కేంద్రమంత్రి మన్ సుఖ్ మాండవియా



పొన్నూరు మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలందరికీ అందించటమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్య మనీ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా. మన్ సుఖ్ మాండవియా పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను 104 మొబైల్ మెడికల్ క్లినిక్ ను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా. మన్ సుఖ్ మాండవియా శుక్రవారం సందర్శించారు . కేంద్ర మంత్రి తో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని రాష్ట్ర ప్రబరి అధికారి కేంద్ర ప్రభుత్వం తరపున సాల్మన్ ఆరోఖ్య రాజ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ప్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి. కృష్ణ బాబు, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె.నివాస్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి లు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా. మన్ సుఖ్ మాండవియా అక్కడ ఏర్పాటు చేసిన పంట పొలంలో రసాయనాలు వెదజల్లెందుకు ఉపయోగించే అత్యాధునిక డ్రోన్ ప్రదర్శనను, పౌర సరఫరాల శాఖ ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ భారత్, టీబీ స్క్రీనింగ్, ఎలిమినేషన్, నెహ్రూయువకేంద్రం. గ్రామ వార్డు సచివాలయ శాఖ మై భారత్ వాలంటీర్ ఎన్రోల్మెంట్ మరియు ఆధార్ క్యాంప్, వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో తొలుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం వీడియోను, ప్రభుత్వ పథకాలపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సభలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్ సుఖ్ మాండవియా మాట్లాడుతూ మామిళ్లపల్లిలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం సంతోషకరం గా ఉన్నదన్నారు. సమాజాభివృద్ధి కొరకు మరియు పేదల అభివృద్ధి కొరకు భారత ప్రభుత్వము గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్దేశించిన విధముగా 17 పథకముల అమలు, దాని వలన జరిగిన, జరుగుచున్న అభివృద్ధిని ప్రజలకు తెలియపరుచుటకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్ రావు, డియం అండ్ హెచ్ ఓ డా. శ్రావణ బాబు, జిల్లా: వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ, జాతీయ లేబర్ బోర్డు చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వైవి. సుబ్బారావు, పొన్నూరు అసెంబ్లీ కన్వీనర్ సుధాకర్, పొన్నూరు మండల తహశీల్దార్ శ్రీకాంత్ కేధార్ నాథ్, యంపిడీఓ శ్రీనివాస్, మామిళ్లపల్లి గ్రామ సర్పంచ్ జాలాది యానాది రావు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ నుండి ఎస్ఐ అయ్యాడు - అభినందించిన ఎస్పీ

గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ ఎస్సైగా ఎంపికైన ఎం వెంకట సుబ్బారెడ్డిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ అభినందించారు. ఇటీవల జరిగిన యస్ ఐ నియామక ప్రక్రియలో జోన్ 4 నుండి ఎస్సై ఉద్యోగం సాధించినాడు. ఇతను జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోల్ రూం లో కానిస్టేబుల్ గా పని చేస్తూ వుండేవాడు. వెంకట సుబ్బారెడ్డి ఎఆర్ పిసి గా 2013 సంవత్సరంలో సెలెక్ట్ అయినాడు. మరలా 2018 లో సివిల్ కానిస్టేబుల్ గా సెలెక్ట్ అయి ప్రస్తుతం పోలీసు కంట్రోల్ రూం లో కానిస్టేబుల్ గా పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన



ఎస్సై ఉద్యోగాల నియామకంలో యస్ ఐ ఉద్యోగం సాధించారు. ఈరోజు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ సుప్రజ, లా ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు ఎస్పీ కే కోటేశ్వరరావు, కంట్రోల్ రూం సి ఐ శివ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి రత్న స్వామి, స్పెషల్ బ్రాంచ్ సి ఐ రాజశేఖరరెడ్డి, శ్రీనివాస్ రావు, యస్పి సి సి శ్రీనివాస్ రావు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపు దుకాణంపై దాడి




తెనాలిక్రైమ్,మేజర్ న్యూస్: తెనాలి రూరల్ మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామం కూల్ డ్రింక్ షాపు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కందసాని సుబ్బారావు అనే వ్యక్తిని శుక్రవారం తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. కొలకలూరులో ఇసుక లారీ పట్టివేత రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో అనధికారికంగా ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీని తాలూకా పోలీసులు పట్టుకున్నారు.కొల్లిపర మండలం నుంచి ఇసుకను అనధికారికంగా తరలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# మంగళగిరిని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతా



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరిని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దే ప్రణాళికలు తమవద్ద ఉన్నాయని, మీ ఇంటి బిడ్డలా భావించి రాబోయే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించాలని యువనేత నారా లోకేష్ మంగళగిరి ప్రముఖులను అభ్యర్థించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రాజకీయాలకు సంబంధం లేని వివిధరంగాల ప్రముఖులను గత 3రోజులుగా యువనేత లోకేష్ కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. 3వరోజైన శుక్రవారం మంగళగిరి పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోడెంటిస్ట్ మాజేటి వంశీ కృష్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ కక్కోలు సత్యనారాయణరావు, ప్రముఖ చేనేత వస్త్రవ్యాపారి తుమ్మా సత్యనారాయణలను కలిశారు. తొలుత మంగళగిరి కొత్తపేటలోని మాజేటి వంశీకృష్ణ నివాసానికి వెళ్లిన లోకేష్ కు సాదర స్వాగతం పలికారు. వంశీకృష్ణ రెండు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ నెలకొల్పి సేవలందిస్తుండగా, వారి కుటుంబసభ్యులు దశాబ్దాలుగా మంగళగిరిలో ఆయిల్ మిల్స్, హెూటల్స్, పెట్రోలు బంకులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, కాండ్రు శ్రీనివాసరావు, సంకా బాలాజీ గుప్తా, దామర్ల రాజు, రంగిశెట్టి బాబి, సుకమంచి గిరి, వల్లభనేని బార్గవ్ , మాచర్ల శ్రీనివాసరావు, విన్నకోట శ్రీనివాసరావు, కొత్తపేట హాస్సేన్ తదితరులు పాల్గొన్నారు.